సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం : 5 : డిసెంబర్ : 2022



యుద్ధ విమానాల విన్యాసాలు







జెమినీ బోట్లపై దూసుకొస్తున్న నేవీ కమాండర్లు

- అబ్బురపరిచిన నౌకాదళ విన్యాసాలు
- జనసంద్రంగా మారిన సాగరతీరం
- ఫలించిన పోలీసుల ముందస్తు వ్యూహం
- అధికారుల సమన్వయంతో వేడుకలు విజయవంతం

సాగరంలో సంబరం



ప్రత్యేక అతిథి పీవీ సింధు సందడి



గీతాలాపన చేస్తున్న గాయకుడు శంకర్ మహదేవన్



వేడుక తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు



రాష్ట్రపతికి నేవీ ప్రత్యేక ప్రచురణను బహూకరిస్తున్న స్కై డైవర్ అనూప్ సింగ్

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): విశాఖ సాగరతీరం.. ఆదివారం జనసంద్రంగా మారింది. ఫిషింగ్ హార్బర్ నుంచి తెన్నేటి పార్కు వరకు సందర్శకులతో కిటకిటలాడింది. నౌకా దళ దినోత్సవం సందర్భంగా లక్షల మంది వీక్షకుల ఆనందోత్సాహాలు, కేరింతల మధ్య సముద్ర జలాలపై నౌకలు, గగనతలంలో యుద్ధవిమానాలు, మెరైన్ కమాండోలు అబ్బురపరిచే విన్యాసాలు అదరహో అనిపించాయి. యుద్ధ నౌకలపై దాడి చేయడం, నడి సంద్రంలో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ సాయంతో రక్షించడం, అత్యాధునిక ఆయుధాలతో శత్రువులపై విరుచుకుపడటం తదితర విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు నౌకా దళ కమాండో బృందం నిర్వహించిన ఆపరేషన్ డెమో ఆహూతులను ఉత్కంఠకు గురి చేసింది. మిగ్ యుద్ధ విమానాలతో గగనతలంలో విన్యాసాలు చూపరులను గగుర్పాటుకు గురి చేశాయి. త్రివర్ణ పతాక రెపరెపలతో గగన వీధుల్లో హెలికాప్టర్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం యుద్ధనౌకలకు అలంకరించిన విద్యుత్ దీపాలు.. తీరం వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు జాతరను తలపించాయి. ఇలా విశాఖ సాగరతీరంలో తూర్పు నౌకాదళం తన విన్యాసాలను ప్రదర్శించి శత్రుదేశాలకు తన సత్తా ఏ పాటిదో చాటి చెప్పింది. జనం చప్పట్లు, కేరింతలతో నావికా దళానికి జేజేలు పలికారు. ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ ఆలపించిన నౌకాదళ గీతం ఆకట్టుకుంది. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరై విన్యాసాలు తిలకించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు సందడి చేసింది. నౌకాదళాధికారులు, ప్రజా ప్రతినిధులు, సెయిలర్స్, నేవీ కుటుంబ సభ్యులు తరలివచ్చారు.

ప్రశాంతంగా నేవీ డే

ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నేవీ డే ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం కావడంతో ఉత్తరాంధ్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా విన్యాసాలను వీక్షించేందుకు ప్రజలు తరలి వచ్చారు. మధ్యాహ్నం 2 గంటల నుంచే సాగరతీరం జనంతో నిండిపోయింది. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన గ్యాలరీలన్నీ కిటకిటలాడాయి. ఈ విన్యాసాలను సుమారు రెండు లక్షల మంది ప్రజలు తిలకించినట్లు సమాచారం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తూర్పు నావికా దళం, జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. నేవీ డేకు అధిక సంఖ్యలో ప్రేక్షకులు వస్తారని పోలీస్ శాఖ ముందే అంచనా వేసి.. అందుకు తగ్గట్టు భద్రతాపరమైన ఏర్పాట్లు చేసింది. ప్రజలను నియంత్రించేందుకు, ప్రజాప్రతినిధులు భద్రతకు 5,400 మంది పోలీసులు రంగంలోకి దించింది. పటిష్ట భద్రత మధ్య ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విన్యాసాలు వీక్షించారు.

పక్కా ప్రణాళికతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

పక్కా ప్రణాళికతో నగర పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు. నేవీ డేకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్, కేంద్ర, రాష్ట్రమంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నావికాదళ అధికారులు హాజరుకావడంతో వారికి, నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరైన ప్రణాళికతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. దీంతో ప్రజలంతా తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకున్నారు. జీవీఎంసీ మంచినీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించింది. ఇలా అన్ని శాఖల సమన్వయంతో నేవీ డే విజయవంతంగా ముగిసింది.





రాష్ట్రపతికి ఘన స్వాగతం

రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గవర్నర్ బిశ్వభూషణ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, నేవీ చీఫ్ హరి కుమార్, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు అమర్‌నాథ్, రజని

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): నౌకా దళ దినోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక విమానంలో 3.50 గంటలకు విశాఖ చేరుకున్నారు. ఆమెతోపాటు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వచ్చారు. వీరు ఐఎన్ఎస్ డేగా మీదుగా రోడ్డు మార్గంలో బీచ్‌రోడ్డుకు చేరుకున్నారు. రాష్ట్రపతికి చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, విడదల రజని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, రాజ్యసభ సభ్యుడు జీ.వి.ఎల్.నరసింహం, కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్, ఫైర్ సర్వీస్ డీజీపీ ఎస్.సంజయ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఇక్కడి నుంచి 4.02 గంటలకు ఆమె బీచ్‌రోడ్డుకు బయలుదేరారు. తిరిగి రాత్రి 7.42 గంటలకు ప్రత్యేక విమానంలో తిరుపతి ప్రయాణమయ్యారు. ఆమెకు ప్రజాప్రతినిధులు, అధికారులు వీడ్కోలు పలికారు.



నేవీ విన్యాసాలు తిలకించేందుకు భారీగా వచ్చిన జనం







బాంబుల మోత..



త్రివర్ణ రెపరెపలు



కదన రంగంలోకి దూకుతూ..



విన్యాసాలను తిలకిస్తున్న నేవీ ఉద్యోగులు

అమరులకు నివాళులు



నివాళులర్పిస్తున్న వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): దేశ రక్షణ కోసం అమరులైన వీరులకు బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా ఘనంగా నివాళులర్పించారు. నేవీ డే పురస్కరించుకుని తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా నేవీ సిబ్బంది కవాతు నిర్వహించారు. మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు చొక్కాకుల పాడేరు రాక

పాడేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన చొక్కాకుల వెంకటరావు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తొలిసారిగా పాడేరు రానున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులతో నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నామినేటెడ్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు.

బైక్ అదుపుతప్పి బోల్తా

- గిరిజన యువకుడి మృతి

అనంతగిరి: ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో గిరిజన యువకుడు మృత్యువాత పడ్డాడు. మండలంలోని ఎగువ శోభ పంచాయతీ సరసపోదర్ గ్రామానికి చెందిన ఎస్.ప్రసాద్ శనివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై అనంతగిరి నుంచి కమలపురం మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదానికి గురయ్యాడు. యువకుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తెరచుకోని చాపరాయి

- నిరాశతో వెనుదిరుగుతున్న పర్యాటకులు



మూతబడిన చాపరాయి జలపాతం

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్దకు పర్యాటకుల ప్రవేశాల నిలిపివేత కొనసాగుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో, తహసీల్దార్ ఐదు రోజులుగా ప్రవేశద్వారాన్ని మూసివేశారు. అయితే ఆదివారం కావడంతో ఈ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులు జలపాతంలోకి దిగారు. వెంటనే స్పందించిన ఎస్‌ఐ సంతోష్‌కుమార్ జలపాతం వద్దకు వచ్చి వారిని పంపించేశారు. ప్రవేశాలు నిలిపివేయడంతో దీనిపై ఆధారపడిన చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చింతపల్లి: పర్యాటక ప్రాంతాల్లోని పచ్చని కొండల్లో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. మండలంలోని ఆంధ్రకశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగికి సమీపంలోని చెరువులవేనం కొండల్లోని వ్యూపాయింట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నందున పర్యావరణానికి విఘాతం కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భీమనాపల్లి నుంచి చెరువులవేనం వరకు దారిపొడవునా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులవేనం కొండపైకి రహదారి సౌకర్యం కల్పించినందున వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు వేగంగా నడపవద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ మహ్మద్ షరీఫ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.



చెరువులవేనం కొండపై పర్యటిస్తున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్



ఆకట్టుకుంటున్న పుట్ట

పుట్ట.. భలేగుంది కదూ..!

పుట్ట మానవుని తల ఆకారాన్ని తలపిస్తోంది. చూడడానికి అచ్చం మనిషి తల మాదిరిగానే ఉంది. మానవుడి రెండు కళ్లు మాదిరిగా భ్రమింపజేస్తున్నాయి. బాలరేవుల రహదారి నుంచి కొండ అంచునుంచి జలపాతానికి వెళ్లే దారిలో ఈ పుట్ట కనువిందు చేస్తున్నాయి. దీనిని చూసిన ప్రతీ ఒక్కరు మానవుని తల మాదిరిగా ఉందని భావిస్తున్నారు. ఈ మార్గంలో వెళ్లే వారు పుట్టను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- కొయ్యూరు

కోరుకొండ సంతలో శాంతి స్థూపం

చింతపల్లి రూరల్: మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన కోరుకొండలో ఆదివారం శాంతి స్థూపం వెలసింది. మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన గిరిజనులకు జోహార్లు అర్పిస్తూ స్థూపంలో నినాదాలు రాశారు. మావోయిస్టుల చర్యల వల్ల ఎంతో మంది గిరిజనుల కుటుంబాలు వీధిన పడ్డాయని, అభివృద్ధికి అడ్డంకిగా మారుతూ మన ప్రాణాలు తీస్తున్న ఇటువంటి నరరూప రాక్షసులను గ్రామాల్లో అడుగు పెట్టనీయవద్దని స్థూపంమీద పేర్కొన్నారు.



శాంతి స్థూపాన్ని తిలకిస్తున్న గిరిజనులు

ప్రకృతి అందాలకు ఫిదా



ఎంజాయ్ అంటే ఇదే కదా : జెండాకొండపై సందడి చేస్తున్న పర్యాటకులు

సాక్షి, పాడేరు: మండలంలోని పర్యాటక ప్రాంతమైన వంజంగిహిల్స్‌కు ఆదివారం పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. ఉదయం మూడు గంటల నుంచే వంజంగి అందాలను తీలకించేందుకు పర్యాటకులు తరలిరావడంతో రహదారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. బోనంగమ్మ పర్వతానికి పర్యాటకులు చేరుకుని, సూర్యోదయం, పొగమంచు ప్రకృతి అందాలను వీక్షించి, ఆనంద పడ్డారు. మంచు అందాలు ఉదయం 10 గంటలకు కనువిందు చేయడంతో పర్యాటలను వంజంగి హిల్స్ వద్ద ఎక్కువ సమయం గడిపారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం వివిధ ప్రాంతాల నంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు విద్యాసంస్థలకు ఆదివారం సెలవు కావడంతో ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చారు. జలపాలంతో స్నానాలు చేశారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

బొర్రా గుహలు కళకళ

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రాగుహలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. పర్యాటకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గుహల ప్రాంగణంలో సందడి నెలకొంది. సుమారు 5,300 మంది తిలకించగా రూ.4.25 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, తదితర సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో సందడిగా కనిపించాయి. అరకు-విశాఖ ప్రధాన రహదారి రద్దీగా మారింది.

చింతపల్లి: పర్యాటక ప్రాంతాల్లో జీసీసీ ఉత్పత్తుల స్టాల్స్‌ను ఆదివారం ఏర్పాటు చేశామని జీసీసీ డీఎం సింహాచలం తెలిపారు. తాజంగి జలాశయం, లంబసింగి, రాజుపాకలులో జీసీసీ ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మేన్ చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



పొద్దు తిరుగుడు పూల అందాల్లో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు



వంజంగి హిల్స్‌పై మంచు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

పాపికొండలకు 400 మంది పర్యాటకులు

వీఆర్‌పురం: పోచవరం బోట్ పాయింట్ పర్యటకుల రాకతో సందడిగా మారింది. ఆదివారం ఆరు బోట్లలో 400 మంది పర్యాటకులు పాపికొండల విహారయాత్రకు బయలుదేరి వెళ్లారని ఏపీ టూరిజవ కౌంటర్ అసిస్టెంట్ రాజేష్ ఆదివారం తెలిపారు. వచ్చే వారంలో పర్యాటకులు మరింతపెరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. పర్యాటకుల రాకతో పేరంటపల్లి శివాలయం, కొల్లూరు హట్స్ తదితర ప్రాంతాలు కళకళలాడాయి.

కొయ్యూరు : చింతవానిపాలెంకు మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న బండకొండ జలపాతానికి ఆదివారం పర్యాటకులు అధికంగా వచ్చారు. వీరిలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులే ఉన్నారు. ఉత్సాహంగా గడిపారు.

డుంబ్రిగుడ: పర్యాటకుల రాకతో సందర్శిత ప్రాంతాలు సందడిగా మారాయి. పాడేరు- అరకు మార్గంలో రోడ్డును ఆనుకొని ఉన్న వలిసె, పొద్దు తిరుగుడు తోటల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని పర్యాటకులు సందడి చేశారు. పూలతోటల్లో ఫొటోలు తీసుకునేందుకు ఒకొక్కరి నుంచి రూ.20 చొప్పున రైతులు తీసుకున్నారు.

హుకుంపేట: సీతమ్మ పర్వతం(జెండాకొండ)కు ఆదివారం పర్యటకులు భారీగా తరలివచ్చారు. శనివారం రాత్రి తరలివచ్చిన కొంతమంది పర్యటకులు కొండపై గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. వేకువజామున మంచు అందాలు, మేఘాలు, సూర్యోదయాన్ని తిలకించారు. వీరి రాకతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది.



కొత్తపల్లి జలపాతంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో కళకళలాడుతున్న బొర్రాగుహలు



స్టాల్‌ను పరిశీలిస్తున్న జీసీసీ డీఎం సింహాచలం



పాపికొండల విహారయాత్రకు వెళ్తున్న పర్యాటకులు



జలపాతం వద్ద సందర్శకులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన అనిల్‌కు మార్‌ని 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: మండలం భీముడుపాకలు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలేశ్వరం ప్రాంతానికి చెందిన సీహెచ్.అనిల్‌కుమార్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అడ్డతీగల నుంచి ఏలేశ్వరం స్కూటీపై వెళ్తున్న ఇతను భీముడుపాకలు వద్ద మలుపులో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పూరిపాకలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అడ్డతీగల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

అనకాపల్లి టౌన్: నాగులాపల్లికి చెందిన సన్యాసిరావు కుటుంబసమేతంగా తన ద్విచక్రవాహనంపై శనివారం సింహాచలం వెళ్లారు. తిరిగి వస్తుండగా సిరసపల్లి జాతీయ రహదారి పక్కనున్న డివైడర్‌ను ద్విచక్రవాహనంతో ఢీకొన్నారు. ఘటనలో సన్యాసిరావుతోపాటు పెద్దకుమారుడు జయశంకర్, చిన్నకుమారుడు మహేష్ (6) గాయపడ్డారు. మహేష్‌కు తలవెనుక భాగంలో తీవ్రంగా గాయమైంది. కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం



సీలేరు రోడ్డులో బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న దుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సంతోష్

- మూడవ రోజు ప్రశాంతంగా పీఎల్‌జీఏ వారోత్సవాలు
- కొనసాగుతున్న తనిఖీలు
- జల్లెడ పడుతున్న పోలీసు బలగాలు

సాక్షి, పాడేరు: పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేసింది. మావోయిస్టుల కార్యకలపాల నిరోధించడమే లక్ష్యంగా అటవీ ప్రాంతంలో పోలీసు బలగాలు భారీగా చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు జిల్లాకు సరిహద్దులో ఉన్న ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీస్ బలగాలు సరిహద్దులో పెద్ద ఎత్తున కూబింగ్ చేపడుతున్నాయి. ఏవోబీ వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లతో పాటు ఔట్‌పోస్టుల వద్ద పోలీసులు అప్రమత్తమయ్యారు. పీఎల్‌జీఏ వారోత్సవాలు మూడోవరోజు ఏవోబీ వ్యాప్తంగా ప్రశాంతత నెలకొంది. అన్ని ప్రాంతాలకు రవాణా వ్యవస్థ అందుబాటులో ఉంది. సమస్యాత్మక ప్రాంతాలైన జీకేవీధి- సీలేరు రహదారిలో తుని, విశాఖపట్నం, నర్సీపట్నం డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు యథావిధిగానే రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. అలాగే ధారకొండ వారపు సంత యథావిధిగానే సాగింది. అన్ని ప్రధాన రహదారుల్లో రాకపోకలు సాగించే వాహనాలను పోలీసులు క్షుణంగా చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.

అరకులోయ రూరల్: మండలంలో రాజధాని జంక్షన్, లోతేరు రహదారి మార్గం, అరకులోయ- విశాఖ రహదారి ప్రాంతాల్లో ఆదివారం ఎస్‌ఐ సంతోష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల వివరాలు తెలుసుకుని విడిచిపెట్టారు.

గూడెంకొత్తవీధి పెదవలస ఆర్మ్‌డ్ పోలీస్ ఔట్ పోస్టు పరిధిలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు.లో సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ దేవేంద్రనాయుడు పాల్గొన్నారు.

కొయ్యూరు: సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కొయ్యూరు–బాలరేవుల రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు.కొయ్యూరు సంత కావడంతో ఆ ప్రాంతం నుంచి అనేక మంది వస్తారు. దీంతో వచ్చిన వారందరినీ తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించారు. కొయ్యూరు సంతలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మావోయిస్టులకు సహకరించవద్దని సూచించారు. వారి మూలంగానే అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇన్ని రోజులు మావోయిస్టుల మాటలు నమ్మి సాధించింది ఏమీ లేదన్నారు. టవర్లు, రహదారులు ఇంత వరకు ఏర్పాటుకాకపోవడానికి పరోక్షంగా వారే కారకులన్నారు. అలాంటి వారి కిసాయం చేసి నేరస్తులు కావద్దని సీఐ హితవు పలికారు. మావోయిస్టులు తగ్గితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. నిర్మిస్తున్న టవర్లను కాపాడుకోవలసిన బాధ్యత గిరిజనులపై ఉందన్నారు. కొయ్యూరు ఎస్‌ఐ రాజారావు పాల్గొన్నారు

ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు

దుంబ్రిగుడ: అరకు-పాడేరు ప్రధాన రోడ్డు మార్గంలో నడుస్తున్న వాహనాలను,ఆర్టీసీ బస్సులను స్థానిక ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. మారుమూల గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

బీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



రంపచోడవరంలో జయహో బీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 7న వైఎస్సార్‌సీపీ తలపెట్టి జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తోందన్నారు. మండల పార్టీ కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, కోసు రమేష్‌బాబుదొర, నాయకులు పండా రామకృష్ణదొర, రాంబాబు, కొండరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి స్నేహం ఆనంద గీతం!

47 ఏళ్ల తర్వాత కలుసుకున్న మున్సిపల్ స్కూల్ 1975 టెన్త్ బ్యాచ్



ఆత్మీయ కలయికలో 1975 టెన్త్ బ్యాచ్

అనకాపల్లి రూరల్: ఐదు పదేళ్లు కాదు.. దాదాపు అర్ధశతాబ్దం సమీపిస్తోంది. వారిలో చాలా మందికి తమ మనవళ్లు, మనుమరాళ్లు కూడా పదో తరగతి దాటేసి ఉంటారు. అలాంటి వారంతా 47 ఏళ్ల తర్వాత తమ సహచర మిత్రులను కలుసుకుని పరవశించిపోయారు. ఎన్నాళ్లయిందిరా.. అంటే.., ఎన్నాళ్లు.. కాదురా.. ఎన్నేళ్లో అయిందంటూ.. ఒకరినొకరు ఆత్మీయాలింగనం చేసుకుని పులకాంకితులయ్యారు. ఎక్కడెక్కడో స్థిర నివాసమేర్పరచుకున్న వారు కూడా తమ చిన్ననాటి స్నేహితుల్ని కలుసుకునేందుకు వచ్చారు. ఆనాటి స్నేహమాధుర్యాన్ని మరోసారి పంచుకున్నారు. ఇదంతా అనకాపల్లి పట్టణం మున్సిపల్ స్కూల్ 1975 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సందడి. ఈ సందడికి ఆదివారం స్థానిక పిసినికాడ వద్దనున్న సత్యమాంబ(సత్తెమ్మతల్లి) ఆలయం వేదికయింది. ఆ నాటి విద్యార్థుల్లో సుమారు 80 మంది తమ కుటుంబసభ్యులతో కలిసి ఈ అపూర్వ కలయికకు హాజరయ్యారు. వీరిలో చాలా మంది ఒకరినొకరు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. ఆ తరువాత పేర్లు విని, ఓరీ నువ్వా? ఎలా మారిపోయావురా? అంటూ పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గవ్వా రాంబాబు, బొప్పే ఉమామహేశ్వరరావు, ఆర్గనైజర్ రాపేటి నారాయణరావు ఈ సమావేశం యొక్క విశిష్టతను వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాల్యపు గుర్తులను జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆటపాటలతో గడిపారు. 2025లో గోల్డెన్‌జూబ్లీ ఉత్సవంగా పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించాలని తీర్మానించారు. బెంగళూరు నుంచి పూర్వ విద్యార్థి ప్రముఖ న్యూరాలజిస్ట్ మళ్ల భాస్కరరావు హాజరుకావడంతో అందరూ ఆయన్ని అభినందించారు. ఇందులో కొణతాల రాజారావు, షేక్ ఇస్మాయిల్, మళ్ల లోకేశ్, పిళ్లా రామకృష్ణ, ఒమ్మి సన్యాసిరావు, బచ్చు చిన్న చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పురోహితుడి ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్‌ఐ గోవిందరావు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలోని పురోహితుడు ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. టౌన్ ఎస్‌ఐగోవిందరావు వివరాల ప్రకారం... బీసీ కాలనీ వినాయక ఆలయం వద్ద ఓరుగుంట శివరామకృష్ణ నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా అతడు పౌరోహిత్యం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పౌరోహిత్యం చేసేందుకు పారుగూరు వెళ్లాడు. భార్య కూడా ఊరెళ్లింది. దాంతో వారిద్దరు ఆడపిల్లలు ఎదురింట్లో నిద్రించారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ప్రహరీ దూకి గునపాంతో తలుపు గడియ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని రెండున్నర తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు. వెండి వస్తువులు బీరువాలోనే వదిలేసి వెళ్లిపోవడం గమనార్హం. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి పూజా వస్తువుల వితరణ



మత్స్యలింగేశ్వర స్వామికి పూజా సామగ్రి సమర్పిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

హుకుంపేట: ఆదివాసుల ఆరాధ్యదైవం, ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో స్థానిక తహసీల్దార్ రాజ్యలక్ష్మి తమ సిబ్బందితో ఆదివారం సందర్శించారు. ఈ నేపథ్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ.20వేలు విలువ చేసే పూజా సామగ్రిని స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. మత్స్యగుండం ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామనారు. డీటీ భాస్కరరావు, సర్పంచ్ శాంతకుమారి, ఆర్‌ఐ రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, చంద్రశేఖర్, రామలింగం, మత్యకొండబాబు, సింహాచలంనాయుడు తదితరులున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ

- కార్మికుడికి తీవ్ర గాయాలు



తాళ్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారి బ్రిడ్జిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొంది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చి లారీ ఢీకొంది. దీంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు ఇక్కడ సిమెంట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. లిఫ్ట్ అడిగి బైక్‌పై పరిశ్రమకు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అతను ఒడిశా వాసిగా తెలిసింది. ఈ మేరకు ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు కాపాడిన ఎయిర్ బెలూన్స్



ప్రమాదానికి గురైన కారు

చింతపల్లి రూరల్: మండలంలోని లోతుగెడ్డ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎయిర్ బెలూన్స్ ప్రాణాలు కాపాడాయి. అనకాపల్లికి చెందిన ఇంద్రగంటి ప్రియాంక్ (33), కామేశ్వరి(65) సూర్య శ్రీరామ్(8), కారు డ్రైవర్ కొత్తపల్లి జలపాతాలను చూసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో లోతుగెడ్డ మీదుగా అనకాపల్లి వెళ్తుండగా రాళ్లలోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను కారు బలంగా ఢీ కొట్టింది. ఆ సమయంలో వెంటనే ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరికి లోతుగెడ్డ పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ లక్ష్మీకాంత్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

యలమంచిలి: మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి గ్రామానికి చెందిన భోజ కొండయ్య (78) అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. రూరల్ ఎస్సై సన్నిబాబు వివరాల ప్రకారం... ఈ నెల 2న మధ్యాహ్నం యలమంచిలిలో ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి, ఇంటి నుంచి బయలుదేరిన అతడు తిరిగి చేరుకోలేదు. దాంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా, బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసినవారు 8179401356, 9705483696 తెలియజేయాలని సూచించారు.



భోజ కొండయ్య



అదృశ్యమైన సురేష్

మతిస్థిమితం లేని వ్యక్తి..

చింతూరు: మతిస్థిమితం లేని కారంపూడి సురేష్ అదృశ్యంపై అతడి తండ్రి రాము ఆదివారం చింతూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని చట్టి గ్రామానికి చెందిన వడ్రంగి వృత్తిదారుడు సురేష్ నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ సమయంలో తెలుపు రంగు టీషర్టు, మబ్బురంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ యాదగిరి తెలిపారు. అతడి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

అండర్-19 ఇంటర్ కాలేజియేట్ గేమ్స్ షెడ్యూల్

చోడవరం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో వివిధ క్రీడాంశాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపికకు ఆర్‌ఐవో ఆదివారం షెడ్యూల్ విడుదల చేశారని క్రీడా కార్యదర్శి జి.రాంబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మోడల్ కాలేజీ విద్యార్థులు పోటీలకు హాజరు కావచ్చన్నారు. 9న విశాఖ మున్సిపల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్, జూడో, స్కేటింగ్ పోటీలకు, 12న ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో లాన్ టెన్నిస్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆయా తేదీలలో ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ జరిగే క్రీడా స్థలిలో సిద్ధంగా ఉండాలని రాంబాబు తెలిపారు.


ఓటు నమోదుపై అవగాహన పెంచాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

అనకాపల్లి టౌన్: ప్రత్యేక ఓటు నమోదు ప్రక్రియను అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో వెంకటరమణ తెలిపారు. ఓటు నమోదుపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలో సత్యనారాయణపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా చేర్పించాలని సూచించారు. ఈ విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జాబితాలో చేర్పులు, మార్పులు సరి చేయాలని సూచించారు.

'డర్టీఫెలో' చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ మూర్తిసాయి, సురేంద్ర, రత్నకుమారి

అనకాపల్లి టౌన్: 'డర్టీఫెలో' చిత్రం మంచి విజయం సాధించాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆకాంక్షించారు. పట్టణంలోని గవరపాలెంలో ఆదివారం చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దర్శకుడు మూర్తిసాయి అనకాపల్లిలో పుట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. గతంలో తీసిన దహనం చిత్రం జాతీయ స్థాయిలో అవార్డు దక్కిందన్నారు. ఉత్తరాంధ్ర కింగ్ నాగార్జున అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర మాట్లాడుతూ ఈ చిత్రంలో స్థానిక కళాకారులు గోల్డ్ వాసు, దాడి జగన్, పిట్ల రాజు, సాయిరాజ్‌లకు అవకాశం కల్పించిన ఈ దర్శకుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు దర్శకుడు మూర్తిసాయిని సత్కరించారు. కార్యక్రమంలో ఏవీ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకుంటున్న విద్యాలయం

మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో రూ.కోట్లతో నిర్మించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల వసతి గృహం ఆకట్టుకుంటోంది. భవనం ఆకట్టుకునేలా రంగులతో తీర్చిదిద్దారు. అంబేద్కర్, గాంధీ , నెహ్రూ, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్,అబ్దుల్‌కలాం తదితరుల చిత్రాలు ప్రత్యేక ఆకర్షణా నిలిచాయి.

\- ముంచంగిపుట్టు



జోలాపుట్టులో నిర్మించిన నూతన వసతి గృహ భవనం